ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## కేంద్ర హోంశాఖకు బాంబు బెదిరింపు
2లో..

సంపుటి: 1 | సంచిక: 239 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 23 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

### జూన్ 2న కేసీఆర్‌కు తెలంగాణ
# సర్కార్ సన్మానం?
### అధికారికంగా కేసీఆర్‌కు ఆహ్వానం పంపనున్న ప్రభుత్వం





హైదరాబాద్, మే 22 (ప్రభాత ఉదయం): కేసీఆర్ అంగీకరిస్తే సాధ్యమయ్యే అవకాశాలు ఉంటాయి. తెలంగాణ సాధనలో అత్యంత కీలక వ్యక్తిగా కేసీఆర్ ను గుర్తించి సన్మానించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్రం ఏర్పడిన పదేండ్లకు కాంగ్రెస్ పార్టీకి అవకాశం రావడంతో తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని ఘనంగా సన్మానించాలని ప్రభుత్వం నిర్ణంచింది. వేలాదిమంది ఉద్యమించినా, ప్రధాన ఉద్యమకారుడిగా, తెలంగాణ తెచ్చిన గొప్ప నాయకుడిగా, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాబట్టి సోనియాతోపాటు కేసీఆర్ ను కూడా ఘనంగా సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం పంపాలని నిర్ణియంచుకున్నట్లుగా తెలుస్తోంది. జూన్ 2న భారీ వేడుకలు నిర్వహిస్తున్న ప్రభుత్వం జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రేవంత్ సర్కారుకు ప్రభుత్వపరంగా తొలి వేడుక నిర్వహించనున్నారు. ధూమ్ ధామ్ గా వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అవతరణ దినోత్సవాన్ని పరేడ్ గ్రౌండ్ లో పదివేలమందితో ఘనంటా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేయనుంది. జయ జయహే గీతాన్ని కూడా అదే రోజున ఆవిష్కరించనుంది. తెలంగాణ ఉద్యమకారుల్ని గౌరవించేందుకు రేవంత్ సర్కార్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ ఇచ్చింది సోనియానే అన్న భావన కల్పించేందుకు కాంగ్రెస్ సర్కార్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. తొలి రెండు, మూడేళ్లు అత్యంత ఘనంగా నిర్వహించారు. తర్వాత సాధారణంగా నిర్వహించారు. ప్రతీ సారి తెలంగాణ అమరవీరుల్ని గౌరవించుకోవడం కామన్ గా వస్తోంది. తెలంగాణ ఇచ్చింది తామేనని చెబుతున్న కాంగ్రెస్ కు వేడుకలు నిర్వహించే అవకాశం తొలి సారి వచ్చింది. అందుకే భారీగా నిర్వహిస్తోంది. అయితే కేసీఆర్ ను బీఆర్ఎస్ నేతలు తెలంగాణ బాపుగా అభివర్ణిస్తారు. అలాంటిది ఆయన కూడా ఓ కారణం అన్నట్లుగా చూపి సన్మానం చేస్తానంటే అంగీకరించే పరిస్థితి ఉండదని.. అలా చేయడం కేసీఆర్ ను అవమానించడమే అన్న అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం నుంచి కేసీఆర్ కు అధికారికంగా ఆహ్వానం పంపిన తర్వాత .. బీఆర్ఎస్ నేతల స్పందన ఏమిటో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ పరంగా నన్మానం చేసినా అది కేసీఆర్ ను అవమానమేనని భావిస్తే ఆయన హాజరయ్యే అవకాశాలు ఉండవు. రేవంత్ మానసికంగా కేసీఆర్ ను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు చేసే అవకాశం ఉంది.




### మోదీ, రాహుల్ స్పీచ్‌లపై
# ఈసీ సీరియస్
### హుందాతనం పాటించాలంటూ అక్షింతలు

న్యూఢిల్లీ, మే 22 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ ప్రసంగాలపైనా అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల ప్రచారం పేరుతో అలాంటి స్పీచ్లు సరికాదని స్పష్టం చేసింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేకి మార్గదర్శకాలు జారీ చేసింది. మత సహనాన్ని దెబ్బ తీసే విధంగా ఎన్నికల ప్రక్రియను తక్కువ చేసేలా ప్రసంగాలు ఇవ్వడం మంచిది కాదని వెల్లడించింది. ఇప్పటికే రెండు పార్టీలూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాయి. ఓ పార్టీ నేతలు మరో పార్టీ నేతలపై ఫిర్యాదు చేశారు. ఈ కంప్లెయింట్స్ని పరిగణనలోకి తీసుకున్న ఈసీ రెండు పార్టీలకూ అక్షింతలు వేసింది. ఈ విషయంలో పార్టీలు తమను తాము డిఫెండ్ చేసుకున్న తీరునీ తప్పుబట్టింది. నేతలు హుందాతనం పాటించాలని తేల్చి చెప్పింది. అధికారంలో ఉన్న పార్టీగా సమాజంలోని సున్నితమైన అంశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ప్రచారం చేసే విధానాన్ని మార్చుకోవాలని జేపీ నడ్డాకి రాసిన లేఖలో ఈసీ స్పష్టం చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ని దృష్టిలో పెట్టుకుని స్టేట్మెంట్లు ఇవ్వాలని తేల్చి చెప్పింది. రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించే విధంగా వ్యాఖ్యలు చేయకూడదని మందలించింది. అటు కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఖర్గేకి కూడా ఇదే విధంగా ..మిగతా 2లో



### సన్మానాలకే బోసన్ అంటూ
# మెలిక పెట్టడం సరికాదు
### వర్షాలు పడతాయని హెచ్చరికలు
### ధాన్యం కొనుగోళ్లలో కదలని అధికారులు
### బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్ధిపేట, మే 22 (ప్రభాత ఉదయం): తుఫాన్ ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కల్లాల్లో పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందన్నారు. చిన్నకోడూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారని చెప్పారు. ధాన్యం ఒకటికి రెండుసార్లు ..మిగతా 2లో



# ఏపీలో రాబోయే ప్రభుత్వంతో సత్సంబంధాలు
### శ్రీవారిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

తిరుమల, మే 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరుమల పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ దర్శనంలో భాగంగా బుధవారం ఉదయం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి ఈరోజు ఉదయం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో తన మనవడు పుట్టు వెంట్రుకలు సమర్పించి మెక్కు చెల్లించుకొన్నారు. ఇక, ఆలయం ముందు మనవడిని భుజంపై ఎత్తుకొని ఫోటోలు దిగారు సీఎం రేవంత్. దర్శనానంతరం ఆలయం ముందు సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ..'ఏపీ సీఎంతో కలిసి సమస్యలు పరిష్కరించుకుని కలసికట్టుగా నడుస్తామన్నారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఒకరికి ఒకరు సహకరించుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో తెలంగాణ ప్రభుత్వం తరఫున సత్రం, కళ్యాణ మండపం నిర్మిస్తామని ప్రకటించారు. శ్రీవారి సేవలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యం కూడా తీసుకోవాలని ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేస్తామన్నారు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదని చెప్పారు. రైతాంగాన్ని ఆదుకుని దేశ సంపదను పెంచాలని తమ ఆలోచన అని తెలియజేశారు.

### చేసిన పనులు
# చెప్పుకోలేక ఓడాం
### కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారు
### ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



నర్సంపేట, మే 22 (ప్రభాత ఉదయం): మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్- నల్లగొండ --ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ ఎన్నికలతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ..మిగతా 2లో

### తెలంగాణ ఆర్టీసీ పేరులో
# కీలక మార్పు
### అధికారికంగా ప్రకటించిన సంస్థ ఎండీ..

హైదరాబాద్, మే 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఆర్టీసీ పేరులో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ విషయాలన్ని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా ప్రకటించారు. నిన్న మొన్నటి వరకు టీఎస్ఆర్టీసీ అని ఉన్న పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సీఎం రేవంత్ పాలనాపగ్గాలు ..మిగతా 2లో

### తిరుపతి గోవిందరాజస్వామి
# బ్రహ్మోత్సవాలు
### సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనం



తిరుపతి, మే 22 (ప్రభాత ఉదయం): తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గోవిందరాజస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కొనసాగింది. ఉదయం శ్రీభు సమేత గోవిందరాజస్వామివారికి స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనంతో అభిషేకం చేశారు. వాహన సేవలో తిరుమలపెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహన్ రావు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నామని, ఉదయం 6.35 గంటల నుంచి స్వామివారు రథంపై, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ..మిగతా 2లో

# చేసిన పనులు చెప్పుకోలేక ఓడాం

**మొదటి పేజీ తరువాయి...**

ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబర్ 9న తొలి సంతకం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాలని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోతది. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ కోరారు. రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే టెట్ పరీక్ష ఫీజు రూ. 20 వేలు చేస్తరని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటుతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఒక గళాన్ని మండలికి పంపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తా అన్నాడు. 50 వేలతో మెగా డీఎస్సీ అన్నాడు. ఈ రెండు అమలు కాలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నారు. అవి కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు. లీగల్ సమస్యల వల్ల ఆగిపోయాయి. కేవలం కాగితాలు ఇచ్చి తాను ఇచ్చానని ఊదరగొడుతున్నారు. విచక్షణ కలిగిన విద్యావంతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. సమాజానికి దిక్సూచిగా ఉంటూ, దిశానిర్దేశం చేసేది మీరే.. మీరు కూడా మళ్లీ మోసపోతారా..? లేదా మేల్కొని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి అవకాశం ఇస్తారా..? ఆలోచించుకోవాలి. బీఆర్ఎస్ తరపున రాకేశ్ రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. రాకేశ్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టారని అన్నారు. తెల్లారి లేస్తే బూతులు తిట్టుడు, వెకిలి పనులు చేసుడు కాంగ్రెస్ అభ్యర్థి లక్షణం. దందాలు చేయడం, బెదిరించడం వంటి కేసులు నమోదైనట్లు కాంగ్రెస్ అభ్యర్థి అఫిడవిట్‌లో ఉన్నాయి. తీన్మార్ మల్లన్న అఫిడవిట్‌లో 56 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆడపిల్లల ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసులు, అనుమతి లేకుండా అమ్మాయిల ఫోన్ నంబర్లను ఫేస్‌బుక్‌లో పెట్టిన కేసులు, బ్లాక్ మెయిల్ చేసిన కేసులు.. ఇలా 56 క్రిమినల్ కేసులు ఉన్న మహానుభావుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. కాబట్టి అభ్యర్థుల గుణగణాలు చూడాలి. మండలిలో వైట్ కాలర్ వర్కర్ ఉండాల్నా.. బ్లాక్ మెయిలర్ ఉండాల్నా ఆలోచించండి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే నర్సంపేట యువత తరపున రేపు మండలిలో గల్లా పట్టి అడిగే పరిస్థితి మాత్రం ఉంటదని అన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడా అని ప్రభుత్వాన్ని నిలదీసే వాయిస్ ఉంటది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరు రైతు బిడ్డలుగా, విద్యావంతులుగా మోసాన్ని గ్రహించి ఓటేయకపోతే నష్టపోయేది మీరే. నోటిఫికేషన్లు ఇవ్వకపోయిన పట్టభద్రులు ఓటేశారు అని ప్రభుత్వం అనుకుంటది. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోయినా మాకు ఓటేశారు అనుకుంటారు. ఒక్క పరీక్షకు కూడా ఫీజు ఉండదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు టెట్ ఫీజు రూ. 400 ఉండే. ఇప్పుడు రూ. 2 వేలు అయింది. మళ్లీ వాళ్లకు ఓటేస్తే టెట్ ఫీజు రూ. 20 వేలు చేయరా..? ఆలోచించండి. పదేండ్లలో తెలంగాణలో ఎంతో ప్రగతి సాధించాం. కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, తండాలు గ్రామపంచాయతీలు అయ్యాయి. ఐటీ ఎగుమతులు పెరిగాయి. పరిశ్రమలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు.

# అమ్మ కమిటీలకు ప్రభుత్వ పాఠశాలల బాధ్యత

## నిర్వహణపై వారికే అజమాయిషీ

హైదరాబాద్, మే 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. పాఠశాల స్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేయాలని అందులో ఇందు కోసం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను అమలు చేయడం,పర్యవేక్షించడం, బలోపేతం చేయడం వంటి పనులు చూసుకుంటాయి. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు పాఠశాలల యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం వంటివి అందించడంతో పాటు అన్ని ప్రభుత్వ పారిశుద్ధ్య పనులను అమ్మ ఆదర్శ కమిటీలే తీసుకుంటాయి. బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం, చిన్న, పెద్ద మరమ్మతు పనులను చేపట్టడం, ఇప్పటికే ఉన్న, పనిచేయని టాయిలెట్ల పునరుద్ధరణ, నిర్వహణ, తరగతి గదుల విద్యుద్దీకరణ, స్కూలు ఆవరణలో పరిశుభ్రతగా ఉండేలా చూడడం, విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, స్కూలు భవనం మొత్తం నిర్వహణ, విద్యార్థులకు యూనిఫారాలు కుట్టించడం వంటి బాధ్యతలను కూడా ఈ కమిటీలకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించారు. అమ్మ ఆదర్శ పాటశాల కమిటీలు ప్రతి స్కూలు స్థాయిలో మహిళ స్వయం సహాయక బృందాల నుంచి ఎంపిక చేస్తారు. గ్రామ సంస్థ లేదా ఏరియా స్థాయి సమాఖ్య ప్రెసిడెంట్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు స్కూలు హెడ్ మాస్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే అన్ని కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటారు. ఇలా చేయడం వల్ల వారికి ప్రభుత్వం కొంత మొత్తం చెల్లిస్తుంది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండడంతో పాటు మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించినట్లు అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. స్కూళ్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటుపై రేవంత్ రెడ్డి సీరియస్ గా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోని సర్కారు బడుల్లో అమలు చేస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి రాష్ట్రంలో అమలు చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించారు. అవసరం



అయితే కార్పొరేట్ సంస్థల నంచి సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాల మెరుగుపరిచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించారు.

# సన్నాలకే బోనస్ అంటూ మెలిక పెట్టడం సరికాదు

మొదటి పేజీ తరువాయి...

తడిసి మొలకెత్తింది. ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని కొనడం లేదని పేర్కొన్నరు. ఒక వేళ కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. తరుగు లేకుండా వెంటనే వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. చిన్నకోడూరు రైతులతో మాట్లాడినప్పుడు ఇంటి అవసరాలకు మాత్రమే సన్న వడ్లు పండిస్తామని, మిగతా వడ్లన్నీ దొడ్డువడ్లేనని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగయింది. 3 లక్షల 29 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి , కేవలం ఐదు శాతం సన్నబడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తానాల కోసం రైతుల పాస్ పుస్తకాలు లైన్లో పెట్టి వేచి చూసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులు కల్లాల్లో తిరిగేవాళ్లు. ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని డిమాండ్ చేశారు.అన్ని రకాల వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులకు వడ్ల బోనస్ విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. డబ్బాలో ఓట్లు పడి, సీల్ పడ్డాక రైతులకు చావు కబురు చల్లగా చెబుతున్నారని ధ్వజమెత్తారు. చిన్న కోడూరు మండల కేంద్రంలో బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో హరీశ్‌రావు మాట్లాడి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అధికారంలోకి రావడానికి బాండ్ పేపర్ మీద 6 గ్యారెంటీలను రాసిన విధంగానే సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బోనస్ విషయంలో ఆలోచించి సన్నవడ్లకే కాకుండా దోడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులను రైతులు గ్రామాల్లో నిలదీస్తారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఆర్టీసీ పేరులో కీలక మార్పు

**మొదటి పేజీ తరువాయి...**

చేపట్టినప్పటి నుంచి అనేక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. పరిపాలనలో తనదైన మార్క్ చూపిస్తూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈక్రమంలోనే స్కూటర్లు, కార్లు, ఇతర వాహనాలు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి టీఎస్ బదులుగా టీజీ అనే అక్షరాలు కేటాయిస్తున్నారు. వారి వాహనాల నంబర్ ప్లేట్‌లలో టీఎస్ బదులుగా టీజీ అని రావడం అప్పట్లో చాలా మందిలో కొత్త చర్చకు దారి తీసింది. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ అయిన ఆర్టీసీ అబ్రివేషన్‌లో టీఎస్‌ఆర్టీసీకి బదులు టీజీఎస్‌ఆర్టీసీ అని కొత్త పేరును తీసుకువచ్చారు. ఈ విషయాన్ని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా తెలిపారు. తన ఎక్స్ ఖాతాలో ఈ సందేశాన్ని జోడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఎస్ ఆర్టీసీగా మార్చడం జరిగిందన్నారు. ఈ మేరకు అధికారిక ఎక్స్ ఖాతాల పేర్లను తెలియజేశారు.

# తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు



హైదరాబాద్, మే 22 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మరో మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 23న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. 24న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. 25న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

# బోనస్‌తో వడ్లు కొనేందుకు ఎందుకు జాప్యం?

## ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లు కొనాల్సిందే ధాన్యం సేకరణకు కేంద్రం సిద్దంగా ఉంది మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మే 22 (ప్రభాత ఉదయం): రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు రైతులను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు ఆగస్టు 15లోగా అమలు చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. సన్న వడ్లకే బోనస్ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని చెప్పారు. చాలా తక్కువ మంది రైతులే సన్న రకం పండిస్తారని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దొడ్డు వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. వాటిని కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటన్నారు. ఈ ప్రభుత్వం బోనస్ పేరుతో అన్నదాతలను మోసం చేసింది. కేంద్రం అన్ని రకాలుగా వారికి అండగా ఉంది. రబీ సీజన్‌లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించాలని కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో భారాస, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయి. ధాన్యం తడిచి మొలకెత్తుతున్నా, కొనుగోలు కేంద్రాలకు తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్‌యార్డుల వద్ద అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం 75 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొనేందుకు మరో 2 నెలలు పడుతుంది. వర్షాలు పడి ధాన్యం మొలకలు వస్తుంటే బాధ్యులు ఎవరని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బోనస్ ఇచ్చి కొనడానికి మీకు బాధ ఏంటని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ రైతులను మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల్ని దగా చేసిందన్నారు. కౌలు రైతులకు 15 వేలు ఇస్తామని చెప్పారు? వరికి క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తామని చెప్పి యే ఒకటి కూడా అమలు చేసేలా లేదన్నారు. రైతులను నయవంచన చేసి అధికారం లోకి కాంగ్రెస్ వచ్చిందన్నారు. దేవుడి పేరుతో ఓట్లు పెడుతూ ప్రజలకి మాత్రం పంగనామాలు పెడుతుంది ఈ ప్రభుత్వం అని మండిపడ్డారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతుందన్నారు.చెయ్యి గుర్తుకు ఓటు వేసినందుకు రైతులకు చేయి ఇస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎంత ధాన్యం పండిన యే రకం అయినా కేంద్రం కొంటుంది? రైతులకు అండగా కేంద్రం ఉంటుంది? డబ్బులు చెల్లిస్తుందన్నారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుంది .. దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం మేరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఖరీఫ్ సీజన్ ది రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదన్నారు. రబీలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందం చేసుకుంటే 33 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది ఈ ప్రభుత్వం అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం మొలకెత్తిన ? కొనుగోలు మాత్రం నామ మాత్రంగా నత్తనడకన నడుస్తుంది?రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న కోనుగులు చేసింది 75 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అన్నారు. సోనియమ్మ రాజ్యం అంటే రైతుల కన్నీళ్లు చూడడమా అని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ధాన్యం ఎఫ్‌సిఐకి చేరే వరకు అయ్యే ఖర్చు మొత్తం భరుస్తుంది? రాష్ట్ర ప్రభుత్వం మీద ఒక్క పైసా కూడా భారం కూడా పడదు? ఇంకా కమిషన్ ఇస్తుంది కేంద్రం? కమిషన్ డబ్బులతో నే ఉద్యోగులకు జీతాలు ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. దొడ్డు రకం వేస్తే అడ్డుకుంటామని సీఎం అంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఎందుకు బోనస్ చెల్లించడం లేదో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. మీ గారెంటీలు గారడీలు కాకుంటే తెలంగాణ ఓట్ల మీద మీకు గౌరవం ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఇప్పుడు కళ్యాలలో ఉన్న దాన్యం కు బోనస్ చెల్లించి కోనాల్సిందే అని డిమాండ్ చేశారు. ధాన్యం మీద కనీస ధర 61 శాతం కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. సన్న బియ్యం కి వెయ్యి బోనస్ ఇవ్వాలన్నారు. మిగతా ధాన్యానికి 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం వెయ్యి రూపాయల బోనస్ ఇస్తుందన్నారు. రుణమాఫి చేయని కారణంగా రైతులు కొత్తగా రుణం తెచ్చుకునే పరిస్థితి లేదన్నారు.



# కేంద్ర హోంశాఖకు బాంబు బెదిరింపు

## ఢిల్లీలో హై అలర్ట్

న్యూఢిల్లీ, మే 22 (ప్రభాత ఉదయం): దేశంలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ.. గత కొన్ని రోజులుగా వివిధ ప్రాంతాల్లో బాంబు బెదిరింపులు రావడం తీవ్ర సంచలనంగా మారింది. పాఠశాలలు, ఆస్పత్రులు, ఎయిర్‌పోర్టులు సహా కీలక ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్లు పోలీసులకు ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్ రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే తాజాగా ఏకంగా కేంద్ర హోంశాఖకే బాంబు హెచ్చరికలు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో భద్రతా బలగాలు, అధికారులు అలర్ట్ అయ్యారు. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న కేంద్ర హోం శాఖ కార్యాలయానికి బుధవారం మధ్యాహ్నం బాంబు బెదిరింపు రావడం సంచలనంగా మారింది. నార్త్ బ్లాక్ వద్ద బాంబు ఉందని.. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ-మెయిల్ రావడం తీవ్ర కలకలం రేపింది. ఈ బాంబు బెదిరింపు ఈ-మెయిల్‌తో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగి.. నార్త్ బ్లాక్ వద్దకు 2 ఫైర్ ఇంజిన్లను తరలించారు. అంతేకాకుండా బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి.. నార్త్ బ్లాక్ ప్రాంతంలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు.. ఆ బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది అనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అసలు అందులో ఎంత వరకు నిజం ఉంది. ఇలా వరుసగా బెదిరింపు ఈ-మెయిల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి. ఎవరు పంపిస్తున్నారు అని విచారణ చేస్తున్నారు. వీటిని ఎవరు పంపిస్తున్నారు.. ఎందుకు పంపిస్తున్నారో తెలుసుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్ని వారాలుగా దేశంలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతం, గుజరాత్, జైపూర్, ఉత్తర్‌ప్రదేశ్, బెంగళూరు సహా వివిధ ప్రాంతాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు రావడం చూస్తూనే ఉన్నాం. బాంబు పేలుడు బెదిరింపులతో దేశంలో అలజడి సృష్టించాలని ఆగంతకులు చూస్తున్నట్లు భద్రతా బలగాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్, సున్నితమైన ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్లు బెదిరింపులు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు వచ్చిన బెదిరింపులు అన్నీ బూటకమే అని అధికారులు తేల్చారు.

# తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు

**మొదటి పేజీ తరువాయి...**

ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. ఇదిలావుంటే తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 22 నుంచి 24 వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7 .30 నుంచి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 23న ఉదయం 7.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నుల పండువగా జరుగనుంది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేశ్ పాల్గొన్నారు.

# మోదీ, రాహుల్ స్పీచ్‌లపై ఈసీ సీరియస్

**మొదటి పేజీ తరువాయి...**

లేఖ రాసింది. అంతకు ముందు కాంగ్రెస్...ప్రధాని మోదీ ముస్లింలపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. మంగళసూత్రాలు కూడా కాంగ్రెస్ లాక్కుంటుందని చేసిన కామెంట్స్పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. అటు బీజేపీ కూడా కాంగ్రెస్ నేత రాహుల్పై కంప్లెయింట్ ఇచ్చింది. ప్రధాని మోదీ ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం అనే విధంగా వ్యవహరిస్తున్నారని రాహుల్ చేసిన వ్యాఖ్యల్ని ఖండించింది. ఈ రెండు కంప్లెయింట్స్ని పరిగణనలోకి తీసుకుని ఇరు పార్టీలకూ అక్షింతలు వేసింది.



కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్నఎస్ పి రుతిరాజ్

# మరణించిన పోలీసు కుటుంబానికి చెక్ అందజేసిన జిల్లా ఎస్పీ రితిరాజ్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(ప్రభాత ఉదయం)అనారోగ్యం కారణంగా మరణించిన పోలీస్ అధికారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ రితిరాజ్ ఇన్సిడెంటల్ చార్జెస్ క్రింద రూ. 10,000 చెక్ ను అందజేసారు. ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ ఈ సంవత్సరం జనవరి నెలలో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఇన్సిడెంటల్ చార్జెస్ క్రింద రూ.10,000 చెక్ ను జిల్లా ఎస్పీ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారి కుటుంబ స్థితి గతులను, వారి పిల్లల విద్యా అభ్యసన వివరాలను తెలుసుకొని మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన పోలీస్ కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు. వారి కుటుంబానికి రావాల్సిన మిగిలిన బెనిఫిట్స్ అన్ని కూడా త్వరగా వచ్చేందుకు కృషి చేయాలని కార్యాలయ ఏ ఓకు ఆదేశించారు. ఈ కార్యక్రమములో కార్యాలయ ఏ. ఓ సతీష్, సూపరింటెండెంట్ నాగేందర్, హెడ్ కానిస్టేబుల్ భార్య రాజేశ్వరి పాల్గొన్నారు.

# 24న రాజేంద్రనగర్‌లో విత్తన మేళ



వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం





వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

బుద్వేల్, మే22(ప్రభాత ఉదయం):ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు నాణ్యమైన విత్తనం అందించాలనే ఉద్దేశంతో ఈనెల 24 న రాజేంద్రనగర్ లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో విత్తన వామేళాను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సంస్థలు ఐ ఐ ఓ ఆర్, ఐ ఐ ఎం ఆర్, ఐ ఐ ఆర్ ఆర్ ఉద్యాన, పశు వైద్య విశ్వవిద్యాలయం, వ్యవసాయ, ఉద్యాన అనుబంధ శాఖలు (టీఎస్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌సీ, టీఎస్ఎస్ఓసీపీ) పాల్గొంటున్నాయన్నారు. అదే రోజున విశ్వవిద్యాలయ పరిధిలోని మూడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, (జగిత్యాల, పాలెం , వరంగల్), వ్యవసాయ పరిశోధనా స్థానాలు అలాగే విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాలలో కూడా విత్తన మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ విత్తనమేళ ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూపొందించిన జీవన ఎరువులు మరియు చీడపీడల నివారణలో వాడే పరాన్న జీవులు మొదలైనవి రైతుల కొనుగోలు నిమిత్తం అందుబాటులో ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగే విత్తనమేళాల్లో 16 పంటలలో 67 రకాలకు సంబంధించి దాదాపు 12 వేల క్వింటాళ్ళ విత్తనాలను రైతులు కొనుక్కోవడానికి అందుబాటులో ఉంచడం జరుగుతుందని వివరించారు. ఈ సీడ్ మేళాలో భాగంగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై రైతుల సందేహాలు తీర్చటానికి ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చా గోష్ఠి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన కల్పించటానికి వీలుగా వ్యవసాయ మరియు అనుబంధ రంగాలతో కూడిన వ్యవసాయ ప్రదర్శన కూడా అదే రోజున నిర్వహిస్తున్నారు. కావున రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ విత్తన మేళా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుచున్నాము. ఈ విత్తన మేళాలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూపొందించిన వివిధ వంగడాలు అనగా వరిలో సన్నగింజ రకాలు (19 రకాలు) బి.పి.టి. 5204, డబ్ల్యు.జి.ఎల్-44, డబ్ల్యు, జి.ఎల్ -962, డబ్ల్యు.జి.ఎల్. 1119, డబ్ల్యు.జి.ఎల్.1246, డబ్ల్యు.జి.ఎల్ 1487, ఆర్.డి.ఆర్ 1162, ఆర్.డి.ఆర్ 1200, కె.ఎన్.ఎమ్ 1638, కె.పి.ఎస్. 6251, జె.జి.ఎల్- 28545, జె.జి.ఎల్ 27356, జె.జి.ఎల్ 33124, ఆర్.ఎన్.ఆర్. 15435, ఆర్.ఎన్.ఆర్- 2465, ఆర్.ఎన్.ఆర్- 11718, ఆర్.ఎన్.ఆర్. 21278, ఆర్.ఎన్.ఆర్. 29325, ఆర్.ఎన్.ఆర్. 15048 దొడ్డు గింజ రకాలు (8 రకాలు), ఆర్.ఎన్.ఆర్ 28361, ఆర్.ఎన్.ఆర్. 15459, కె,ఎన్.ఎమ్ 118, ఎమ్.టి.యు 1010, డబ్ల్యు.జి.ఎల్- 915, జె.జి.ఎల్ 24423, జె.జి.ఎల్ 28639, సువాసన కలిగిన రకం (1) ఆర్.ఎన్.ఆర్-2465, మొక్కజొన్నలో (5 హైబ్రిడ్స్) డి.హెచ్.యం 117, డి. హెచ్.యం 121, బి.పి.సి. హెచ్. 6, కరీంనగర్ మక్క, కరీంనగర్ మక్క-1, జొన్నలో (2 రకాలు) పి.వై.పి.ఎస్-2, సి.ఎస్.వి-41, రాగిలో (1) పి.ఆర్.ఎస్. 38, ఆముదం లో (1 రకం) పి.సి.హెచ్. 111, నువ్వులు ( 1 రకం) జె.జి.యస్-1020, వేరుశనగ లో (1 రకం) ధరణి విత్తనాలను అందుబాటులో వుంచడం జరుగుతుంది. అపరాల పంటలైన పెసరలో (4 రకాలు) డబ్ల్యు.జి.జి 42, ఎమ్.జి.జి 295, ఎమ్.జి.జి 347, ఎమ్.జి.జి 385, మినుములో (1 రకం) యం.బి.జి. 1070, కందిలో (8 రకాలు) హనుమ, డబ్ల్యు.ఆర్. జి.ఇ- 97, డబ్ల్యు.ఆర్. జి.ఇ-93, డబ్ల్యు.ఆర్. జి.ఇ-121, డబ్ల్యు.ఆర్. జి.ఇ-255, పి. ఆర్. జి-176, టి.డి.ఆర్.జి-59, ఆశ సోయాచిక్కుడులో (4 రకాలు) బాసర, కె.డి.ఎస్-726, ఎం.ఎ.యు.యస్-612, ఎ.ఐ.ఎస్.బి-50 మరియు పశుగ్రాస పంటల విత్తనాలు అందుబాటులో ఉంచడం జరుగుతుంది.



హైదర్ షా కోట్ సన్ సిటీలో జరిగిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామీ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సమ్మెట శ్రీనివాస్ తదితరులు

## ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

బుద్వేల్, మే22(ప్రభాత ఉదయం) : గండిపేట్ మండలం బండ్లగూడ జాగిర్ హైదర్ షా కోట్ సమీపంలోని సన్ సిటీలో బుధవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు . వేడుకల్లో హైదర్ గూడ కు చెందిన సమ్మెట శ్రీనివాస్ తో పాటు వందలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. పూజలలో బండ్లగూడ జాగిర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కె. మాధవ చారి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### కార్మిక యోధుడు

## పర్స సత్యనారాయణకు ఘనంగా నివాళులు

రాజేంద్రనగర్, మే 22(ప్రభాత ఉదయం)కార్మిక యోధుడు పర్స సత్యనారాయణ కు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక నాయకుడు ఆదర్శమూర్తి పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సిఐటియు నాయకులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ హాజరై మాట్లాడుతూ... పర్స సత్యనారాయణ 19 ఏళ్ల వయసులోనే ఎర్రజెండా చేతబట్టి పేదల పక్షాన పోరాటం చేసి గొప్ప కమ్యూనిస్టు నాయకుడుగా పేరు తెచ్చుకున్నాడని అన్నారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పర్స సత్యనారాయణ కీలక పాత్ర వహించి భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం అనేక పోరాటం నిర్వహించిన నాయకుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేగా పనిచేసి సొంత ఇల్లు కూడా సంపాదించుకోకుండా ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి సిఐటి యు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు .అలాగే 1970లో సిఐటియు ఆవిర్భావం సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పర్స సత్యనారాయణ , నండూరి ప్రసాద్ రావు వ్యవస్థాపక సభ్యులలో ముఖ్యులు అని అన్నారు తెలుగు రాష్ట్రాలలో కార్మికులకు ఈఎస్ఐ,పిఎఫ్ 12 గంటల గురించి అనేక పోరాటం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్ బుగ్గ రాములు, ఎల్లయ్య, వీరయ్య, ప్రవీణ్, పెంటయ్య , రాములు, కాటేదాన్ పారిశ్రామిక ప్రాంత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పారుచర్ల సవరమ్మ దేవర ఉత్సవాలు





ధరూర్ ,మే22(ప్రభాత ఉదయం) ధరూర్ మండలంలోని పారుచ్చర్ల, మన్నాపురం,అల్వాల్ పాడు గ్రామాల్లో పారుచ్చర్ల సవారమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామ దేవతకు గ్రామస్తులు కుంభాలతో వెళ్లిపూజలు నిర్వహించారు. గ్రామాల్లో తమ అభిమాన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, గ్రామాల్లో మిఠాయి, గాజుల అంగళ్లు, వివిధ వ్యాపార సముదాయాలతో కళకళలాడాయి. గ్రామ దేవతను దర్శించుకున్న నాయకులు దేవర ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంధు మిత్రులతో కలిసి విందుభోజనం చేశారు. ఊర్ల దేవర సందర్భంగా గ్రామాలలో బంధుమిత్రులతో సందడిగా మారింది.



జహంగీర్ పీర్ దర్గా లో పాతీయాలు ఇస్తున్న మైనార్టీ నాయకుడు ఫషి యుద్దీన్

## రంజిత్ రెడ్డి విజయం కోసం జహంగీర్ పీర్ దర్గాలో పాతియాలు ఇచ్చిన పసియుద్దిన్

శంషాబాద్, మే 22 ( ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయం సాధించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ పసియుద్దిన్ జహంగీర్ పీర్ దర్గాలో పాతియాలు సమర్పించారు. గత ఐదు సంవత్సరాలలో రంజిత్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వాటిని తిరిగి కొనసాగించడం కోసం ప్రజలందరూ హస్తం గుర్తుకు ఓటు వేసి మద్దతు పలికారు అని అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తున్న రంజిత్ రెడ్డిని రెండవసారి గెలవాలని కోరుతూ జహంగీర్ పీర్ దర్గాలో పాతియాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు పసియోద్దీన్ వివరించారు. గత ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా రంజక కార్యక్రమాలు అభివృద్ధి పనులు చూసి ప్రజలు కాంగ్రెస్కు పట్టం కట్టారని రంజిత్ రెడ్డి వరుసగా రెండోసారి విజయం సాధించి తీరుతారని ఆయన భీమా వ్యక్తం చేశారు.

# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలని అధికారుల విజ్ఞప్తి

రాజేంద్రనగర్, మే 22(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్, మే 22(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయ 11 గంటల నుండి 12.30 వరకు బుద్వేల్ గ్రామం, గ్రీన్ సిటీ, శివ సాయి కాలనీ, గ్రీన్ మెడోస్, శాంతి గృహాలు , పరిసర ప్రాంతాలు, సహారా హోమ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో (ఉప్పర్‌పల్లి సబ్ స్టేషన్) మధ్యాహ్నం 1నుండి 2.30 వరకు జలాల్‌బాబా నగర్, ఖయామ్ నగర్, మహమూదాబాద్, రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఉప్పర్‌పల్లి ఫీడర్ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4.30 వరకు సత్నాంగ్ విహార్, హ్యాపీ హోమ్స్, జనచైతన్య, గదా బేగ్, ఫేజ్ %×××% టవర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హాథిరాం తెలిపారు ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### కాటేదాన్, రాఘవేంద్ర కాలనీలో ...

రాఘవేంద్ర కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి గురువారం ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన రాఘవేంద్ర కాలనీ అలీ బై మజీద్ ఏరియా , శాస్త్రి పురం జూన్ కిరాణా కీర్తి వాటర్ ఎమ్మెస్ స్కూల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### బాబుల్ రెడ్డి నగర్ లో...

నేషనల్ పోలీస్ అకాడమీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి మూడు గంటల వరకు, మూడు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

### హిమాయత్ సాగర్ ...

హైదర్ షా కోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11



గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం వెంకటేశ్వర కాలనీ డైమండ్ వ్యాలీ ప్రశాంత్ నగర్ బృందావన్ కాలనీ తిరుమల గార్డెన్ పద్మశ్రీ హిల్స్ పావని హార్మోని విల్లాస్, బండ్లగూడ జాగీర్, కాళీ మందిర్ విద్యుత్తు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండున్నర గంటల వరకు విద్యానగర్ వీకర్ సెక్షన్ కాలనీ సుబ్రమణ్య కాలనీ శివ పూరి శివ సాయి నగర్ బైరాగి గూడా సంజయ్ గాంధీ నగర్ ఇండస్ వ్యాలి, లిబ్ డం విల్లాస్ ,సంఘం సిటీ, భాగ్యనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు పవన్ పటేల్స్ కేకే కన్వెన్షన్ రాధానగర్ రాధా నగర్ ఫేస్ టు రఘురాం నగర్ ప్రాంతాలలోసరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన పవన్ పటేల్ కేకే కన్వెన్షన్ రాధానగర్ రాజనగర్ ఫేస్ టు, గంధం గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

### కిస్మత్పూర్ లో విద్యుత్ సరఫరా నిరుపేత ...

కిస్మత్పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓమ్‌నగర్, రాఘవేంద్ర కాలనీ, యాదాద్రి కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్‌షిప్, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎస్ఎం కన్‌స్ట్రక్షన్స్, రాధా రియాలిటీ, గిరిధారి, గిరిధారి కళాఖండాల్లో సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు

### కోత్వాల్ గూడ లో విద్యుత్ సరఫరా నిలిపివేత...

శంషాబాద్ పరిధిలోని వివిధ గ్రామాలలో పలు వార్డులలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు శంషాబాద్ ఏఈ అఫ్సర్ షేక్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని కోత్వాల్ గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎం.ఆర్.ఓ కార్యాలయం వద్ద గల విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అఫ్సర్ షేక్ భాషా తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన కొత్వాల్ గూడ ఆర్కే గార్డెన్ ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతం మహావీర్ బిల్డర్స్ ప్రాంతం శంషాబాద్ మార్కెట్ ఇంచ్ బై ఇంచ్ ప్రాంతం కాశిష్ ఫంక్షనల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం%ఉ% ఉంటుందని ఆయన పేర్కొన్నారు వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.

### నేడు శంకరాపురం విద్యుత్తు ఫీడర్ పరిధిలో సరఫరా నిలిపివేత

శంకరాపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమ్మతుల నిమిత్తం గురువారం సరఫరా నిలిపివేస్తున్నట్లు షాపూర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 23 ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు, రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తొండుపల్లి పకృతి ఫామ్స్, సుభాసన గ్రీన్స్, ముఖారి ఎస్టేట్స్, పెద్ద తూప్రా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## వైభవోపేతంగా శంషాబాద్ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

# కల్యాణం.. కమనీయం




స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



స్వామివారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు కొలను సుష్మా మహేందర్ రెడ్డి దంపతులు, గణేష్ గుప్త దంపతులు

రాజేంద్రనగర్,మే22(ప్రభాత ఉదయం) శంషాబాద్ మున్సిపల్ పరిధి నర్సింగ్ మందిర్ ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం మహోత్సవం బుధవారం ఆలయ అర్చకులు వేదమంత్రోచరణల మధ్యన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని కన్నుల విందువుగా నిర్వహించారు.రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్నీ ఆకట్టుకుంది.ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక రంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్య ధారణ చేయించారు.కల్యాణ మహోత్సవానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ హాజరై ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక్య పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేటి.ప్రకాష్ గౌడ్ తోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ కోలన్ సుష్మామహేందర్ రెడ్డి,కౌన్సిలర్లు ఆయిల్ కుమార్,రేఖ గణేష్ గుప్తా,పట్టణ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్,సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,మహేందర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు కొనమోళ్ళ శ్రీను నలుమూలల భక్తులు హాజరయ్యారు. అనంతరం కల్యాణ మహోత్సవం తిలకించారు.మొక్కులు చెల్లించుకొని స్వామి తీర్థ ప్రసాదం తీసుకున్నారు.ఈ కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు.



చేవెళ్ల బిజెపి ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న పరమేష్ గౌడ్

## కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు

శంషాబాద్, మే 22(ప్రభాత ఉదయం) శంషాబాద్ భారతీయ జనతా పార్టీ నాయకులు కొండా పరమేష్ గౌడ్ బుధవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిశారు. బుధవారం ఆయన నివాస గృహంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరోజిని వివరించారు. భారతీయ జనతా పార్టీ అవార్డు నడుస్తున్నదని. ముఖ్యంగా మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ రాష్ట్ర ప్రజలందరూ ఏకపక్షంగా ఓటింగ్లో పాల్గొన్నారని పరమేష్ గౌడ్. కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి తెలియజేశారు. చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని తాండూరు. వికారాబాద్. పరిగి. చేవెళ్ల శేరిలింగంపల్లి రాజేంద్రనగర్. మహేశ్వరం నియోజకవర్గం లో కూడ ప్రజలు కమలం పువ్వుకు ఓట్లు వేశారని తెలిపారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయం అని పరమేష్ గౌడ్ వివరించారు.



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి దంపతులు

## శ్రీశ్రీశ్రీ సోమనాథ్ జ్యోతిర్లింగాల (శివుడు) స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(ప్రభాత ఉదయం) గద్వాల ఎమ్మెల్యే దంపతులు బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి , తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి ఎమ్మెల్యే దంపతుల వివాహం వార్షికోత్సవ సందర్భంగా గుజరాత్ రాష్ట్రంలోని హిందూ పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీ సోమనాథ్ జ్యోతిర్లింగాల (శివుడు) స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుని ఆశీస్సులు తీసుకున్నారు.



## భూతగాదాలు, కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(ప్రభాత ఉదయం) భూతగాదాలు, కుటుంబ కలహాలు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మనవపాడు మండల పరిధిలోని ఏ-బుడిదపాడు గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏ-బుడిదపాడు గ్రామానికి చెందిన మాల నరసింహులు తన భార్య వరలక్ష్మి (39), కూతురు అనురాధ (18) భూతగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగారు. ఈ ఘటనలో వరలక్ష్మి, అనురాధ పరిస్థితి విషమించడంతో హుటాహుటిన కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందేలోపే ఇద్దరు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.మాల నరసింహులు మాత్రం ఆత్మహత్య చేసుకోవాలని భావించినా.. పురుగుల మందు తాగడానికి భయపడ్డాడు. అయితే తన కళ్ళ ముందే భార్య, కూతురు చనిపోవడంతో కుప్ప కూలిపోయాడు. గత కొన్ని రోజులుగా అన్నదమ్ములకు మధ్య భూ తగాదాలు ఉన్నాయి. ఎన్నోసార్లు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకోవడం గొడవలు చేసుకున్నట్లు తెలిసింది. అయితే కూతురు, కొడుకు చదువు కోసం పెళ్లి కోసం చాలా ఇబ్బందులు గురవుతున్నామని, తమకు వారసత్వం కింద ఇచ్చిన భూములు సీలింగ్ ఉ ఒడడంతో ఎవరు కొనడం లేదని భావించి ఎన్నోసార్లు అన్నదమ్ములతో మాల నరసింహులు ప్రాధేయపడ్డాడు. తన కుటుంబానికి ఎవరూ సహకరించడం లేదని భావించి మంగళవారం కుటుంబ సభ్యులు చనిపోవాలని పురుగుల మందు సేవించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనలో తల్లి కూతురు మృతి చెందారు. కొడుకు హైదరాబాద్‌లో చదువుకుంటున్నట్లు తెలిసింది. ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా ప్రత్యేక అధికారిని శృతి ఓజా



ధాన్యము పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శృతి ఓజ, జిల్లా కలెక్టర్ బిఎస్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(ప్రభాత ఉదయం)కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారిని, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ శృతి ఓజా అధికారులకు సూచించారు. బుధవారం గద్వాల మండలం బీరెల్లి, లత్తిపురం గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఐకెపి ద్వారా నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే లారీలలో లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. డాటా ఎంట్రీ పనులను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ, రైతులకు వెంటనే డబ్బులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్ లో 70 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగినది, ప్రస్తుతం 10 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ జరుపుతున్నామని, ఎక్కడ కూడా తరుగు వంటివి లేకుండా గట్టి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉంచామని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మునిని వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సరిత

## ఈదురుగాలులకు,వర్షానికి నష్టపోయిన బాధితులను పరామర్శించిన జెడ్పీ చైర్ పర్సన్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(ప్రభాత ఉదయం)మంగళవారం గద్వాల నియోజకవర్గంలో పలు గ్రామాలలో ఈదురుగాలుల బీభత్సానికి ఆస్తినష్టంతో పాటు చెట్లు, విద్యుత్ స్థంబాలు విరిగి గుడిసెలు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత బుధవారం గద్వాల మండలం లత్తిపురం గ్రామంలో సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈదురు గాలులకు ముష్టి దుబ్బ రంగన్న, వడ్డే తిమ్మన్న ల గుడిసెలు కూలీపోయాయి. బాధిత కుటుంబాలకు జెడ్పి చైర్ పర్సన్ సరిత ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేద ప్రజలకు ఇండ్ల నిర్మాణం చెప్పటకపోవడం ద్వారా ప్రజలకు ఈ దుస్థితి నెలకొందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు ఇచ్చిన హామీ లలో డబుల్ బెడ్ రూంలు ఇచ్చి ఉంటే ఇంత నష్టం వాటిల్లే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షాన నిలుస్తొందన్నారు. ఈదురుగాలులకు నష్టపోయిన వారికి,ఇండ్లు లేని ప్రతి ఒకరికి లబ్ధిదారులను గుర్తించి పక్క ఇందిరమ్మ ఇండ్లు అదేవిధంగా కృషి చేస్తానని ఆమె బాధితులకు హామీ ఇచ్చారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు లత్తిపురం వెంకట్రామిరెడ్డి, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ బాబు, పూడూర్ ఈశ్వర్, జయన్న,లక్ష్మణ,జమ్మిచేడు ఆనంద్,కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,కుర్మన్న, రాజశేఖర్ యాదవ్, సంజన్న,సమీ,రాజు తదితరులు ఉన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పనిచేయాలి : చైర్మన్ సరిత




మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సరిత



సమావేశంలో సభ్యులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 22(ప్రభాత ఉదయం)ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించడంతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ సరిత అధికారులను ఆదేశించారు. బుధవారం గద్వాలలోని పాత ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో జడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఎజెండాలో చేర్చిన అంశాలపై చర్చించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు గురించి మాట్లాడారు. పలువురు జడ్పీటీసీలు తమ మండలాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై ప్రశ్నించగా, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరించారు. ఇందులోని ప్రధాన అంశాలపై జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత మాట్లాడుతూ, సదరమ్ ధ్రువపత్రాలు పొందేందుకు స్లాట్ బుకింగ్ సమయాన్ని పెంచేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వర్షాకాలం ప్రారంభం కాగానే హరితహారంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా టిఆర్టి ద్వారా కొత్త టీచర్ల నియామకం చేపట్టే వరకు వాలంటీర్ల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు సమయానికి విధులకు రావాలని, వివిధ టెస్టులు బయటకు రాయకుండా అందుబాటులో ఉన్న ల్యాబ్ లోనే చేయాలన్నారు. అక్కడ ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకొని ముందుకెళ్లాలన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పారిశుధ్య పనులను చేపట్టి రోగాలు వ్యాపించకుండా అవసరమైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఐజ నుంచి మేడికొండ వరకు ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణం పూర్తి చేయాలని, ఐజ పట్టణంలోని వంతెన పనులు కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్లాస్టిక్ వాడకం పెరుగుతోందని దాంతో క్యాన్సర్ వ్యాధితో మరణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ సరోజమ్మ, జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ, పలువురు జడ్పిటిసిలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.